# అపార్థం



"ఒక వంటిల్లూ ఒక పెద్ద గదీ మనకు చాలదూ?" అన్నాడు ప్రఫుల్ పద్మినికి వాటాచూపిస్తూ. పద్మిని మాట్లాడలేదు.

"నీకు సరిపోలేదా? ఈ గోడకు రెండు అలమార్లున్నాయి. నీవస్తువులు ఒకదాంట్లోను, నావి మరొక దాంట్లోనూ ఉంచుకోవచ్చు. ఇక మనం పెట్టెలు కొనవలసిన అవసరముండదు." ఏదో చెప్పుకుపోతున్నాడు ప్రఫుల్.

పద్మిని ఖాళీగా చూసింది.

"అది కాదండీ....."

ఏదో చెప్పాలని ఉన్నది. చొరవ తీసుకొని చెప్పేటంత చనువు ఇంకా ఏర్పడలేదు. ఏదీ, పెళ్ళిఅయి ఇంకా రెండుమాసాలచిల్లర. అందులోనే కొంతకాలం ఎడబాటు. శాశ్వతమైన అనుబంధం కోసం స్వల్పమైన పరిచయం.

"చెప్పు పద్మినీ."

"పక్కవాటాలో ఎవరన్నా....."

"ఓ, అదా! పక్కవాటావిషయం నేనప్పుడే కనుక్కున్నాగా! ముసలాయనా, ముసలావిడా ఉంటున్నారు. కూతురికి ఏదోజబ్బుగా ఉన్నదట. సాయం చేయడానికిపోయింది ఆమె. వారం దినాల్లో వస్తుందట. ఆమె వస్తే నీకు మంచి కాలక్షేపం."

పద్మినికి సందేహం తీరలేదు. అదితీరని సందేహం వంటిది. దాన్ని చెప్పాలంటేనే చిరాగ్గా వున్నది. మేడమీద కాలేజీ కుర్రవాళ్ళు.

పద్మినీ, ప్రఫులూ ఈవాటా చూడడానికి మొన్న సాయంకాలమే ఒకసారి వచ్చారు. తాళం వేసి ఉండటం వలన వీధిలోనుండే వెళ్ళిపోవలసి వచ్చింది. అప్రయత్నంగా తాను మేడమీదికి చూచింది. అక్కడ ఇద్దరు కుర్రవాళ్ళు......అదో మాదిరి గా పద్మినివైపు చూచారు.

మళ్ళీ ఈ రోజున తాము ఇంట్లోకి వస్తుండగా మేడమెట్ల వరకు వచ్చి, ఏదో వింత జరుగుతున్నట్లు చూశారు. వంటింటి అవతల కొద్దిగా కాళీజాగా ఆ వెనుక బావి, బావిలోతు చూడాలి గదా ....... అక్కడికి వెళ్ళి పైకి చూడగా ఆ కుర్రాళ్ళు అటువేపుగా వచ్చి చూడడం కనబడింది.

అట్లా వాళ్ళు చూడడం పద్మినికి నచ్చలేదు. పద్మిని వాళ్ళను గూర్చి ఆలోచిస్తూ, అలమారు తలుపులు సరిగ్గా మూసుకుంటాయా, అద్దాలకు పాలీషు సరిగ్గా ఉన్నదా అని పరీక్షిస్తున్నట్లు కాలం గడిపింది.

"పరవాలేదు పద్మినీ. ఇల్లు బాగానే ఉంటుంది. అంతగా 'బాగా లేదని అనిపిస్తే నెమ్మది మీద వేరే యింటికి మారవచ్చు" అని ప్రఫుల్ వంటింటి తట్టుకు వెళ్ళి, తలుపులు బిగించి వచ్చాడు. కాలేజీ కుర్రవాళ్ళు తనవైపు ఆ రీతిగా చూడడం మాత్రం అదెంతో బాధాకరమైన విషయం అనుకుంది పద్మిని.

పద్మినికి పెళ్ళికాని రోజుల్లో ఎదురింటి వీధిగదిలో ఉండే అబ్బాయి తనను ఏదో ఆప్యాయంగా చూచినట్లుగ చూచేవాడు. పలు కరించేవాడు, పుస్తకాలూ, పూలూ ఇచ్చేవాడు. ఎదురింటి మీనాక్షమ్మగారు అప్పుడప్పుడు పిలిచి ఏదైనా చిల్లర పనులు చెప్పేది. వాళ్ళకు పద్మిని తలిదండ్రులకు స్నేహం. ఆ అబ్బాయి చూపులు బాగానేవుండేవి. నీచమైన అర్థం ఎన్నడూ రాలేదు. ఒకనాడు.....

మీనాక్షమ్మ లేని సమయంలో ఆ అబ్బాయి, వాళ్ళ వీధి గుమ్మంలోకి వచ్చి" మీ మీనాక్షి అత్తయ్య రమ్మంటున్నది" అన్నట్లుగా సైగచేశాడు. లోపలికి వెళ్ళి తాను అత్తయ్యకొరకు వెతుక్కుంటూ ఉండగానే అతడు......

తనకు ఎంతో భయం వేసింది.

అతడు తనను ప్రేమిస్తున్నానన్నాడు. పెళ్ళాడుతానన్నాడు. పారిపోదామనుకున్నది ఆమె. అతడు వదలిపెట్టడే! చివరికి అతడేమీ చొరవ చేయకముందే తాను బయట పడింది కానీ......పద్మిని ఇంటిలోనికి వెళ్ళేసరికి మేనమామ కొడుకు విశ్వం ఇంటికి వచ్చి ఉన్నాడు. నరకంలో నుండి స్వర్గానికి ఎగిరినట్లయింది. కాని, తల్లి తనను దబాయించి అడిగింది.

మీనాక్షమత్తయ్య ఇంట్లోనుండి తాను బయటికి వస్తూండగా తల్లి చూచింది.

"ఆమెలేదు కదా ఆ ఇంటికి ఎందుకు వెళ్ళినట్లు?"

"అత్తయ్య రమ్మందని ఆయన చెప్పాడు."

"ఏమీచెప్పలేదు."

"సైగ చేశాడు."

"అతడు సైగ చేయడము, నీవువెళ్ళడము.....చాల బాగా వున్నది."

ఎంతో సేపు కాలేదు. అంతా మూడు నిముషాలు......అంతే అంతులేని అగాధం తల్లికి, తనకు మధ్య ఏర్పడింది.

బావతనవైపు జాలిగా చూస్తూ ఉండినాడు. ఆ మూడురోజులూ తల్లి బావను పలుసార్లు అడిగింది.

"విశ్వం! నీకు ఉద్యోగం కూడా చిక్కింది. పద్మిని ఈ ఇంట్లో ఇంకా ఎంతకాలం ఉండాలి? త్వరగా ఆ మూడు ముళ్ళూ వేసి తీసుకుపో, బాబూ!" అని సూటిగా చాటుగా పలురకాలుగా

అంతకు ముందంతా "పద్మిని అంటే నా కిష్టమే' అత్తయ్యా!.....పెళ్ళంటావా ఉద్యోగం రానివ్వు" అంటూండే బావ......"ఆలోచిద్దాం, అత్తయ్యా! నాన్న ఒప్పుకోవాలిగా మరి!" అన్నాడు...."పద్మినిని మెట్రిక్ పరీక్షకి కట్టించాలి, అత్తయ్యా! కొన్నాళ్ళ పాటు భార్యా భర్తలు ఉద్యోగం చేయడం ఈ రోజుల్లో పరిపాటి "అన్నాడు.

ఏవిషయంగాని అతడు వ్రాయలేదు.

ఒక క్షుద్రమైన, స్వల్పమైన సంగతివల్ల పద్మిని జీవితం మారి పోయింది. విశ్వం భార్య కాగల అవకాశం తాను కోల్పోయింది. ప్రఫుల్ వచ్చి "పోదామా" అన్నాడు.

"పైన ఎవరండి కాపురముండేది?"

"పైనా?" ప్రఫుల్ గదిలోనుండే తల పైకెత్తి చూశాడు. మిద్దె అడ్డం వచ్చింది.

తలదించి "ఎవరో కాలేజీ కుర్రవాళ్ళు

డాక్టర్ టి.ఆర్. కృష్ణన్

న్నట్లుంది." అన్నాడు. అతనికేమో ఏమీ అనుమానం తగిలినట్లులేదు

స్పష్టంగా చెప్పేదెట్లా! "కాలేజీకుఱ్ఱవాళ్ళు ఉండేచోట అల్లరిగా ఉంటుందండీ" అని చెపితే అతనేమనుకుంటాడో!

ఆ ప్రశ్న గుర్తు పెట్టుకొని అతడు లోతుగా ఆలోచించి విచా

రిస్తే?.....తన సంగతి తెలిసిపోతుందేమో!

దేవుడా!...

తన తల్లి బోలా మనిషి. గడుసుగా అడిగితే చాలు అంతా చెప్పేస్తుంది. "దిక్కు మాలిన ముండా కొడుకు. నా కూతురు బ్రతుకు పాడు చేశాడు." అంటుంది. అక్కడ తాను శీలాన్ని పోగొట్టుకో లేదన్న సంగతి ఎవరు నమ్ముతారు? విశ్వం బావ నమ్మలేదు. ప్రఫుల్ నమ్మడు. .....తానుగా " అమ్మా నువ్వు నన్ను అనుమానిస్తున్నావా! నేనేం పాపపు పని చెయ్యలేదు."అంతగా తర్కించి ఆమె అడగనూ లేదు.

"కాలేజీ కుఱ్ఱవాళ్ళు అయితే నేమి? వాళ్ళు పైనే వుంటారు. స్నానానికి నీళ్ళు కూడా పని వాళ్ళతో డాబా మీదికి తెప్పించుకుంటారు. ఎప్పుడో కాలేజీకి పోయేటప్పుడు. వచ్చేటప్పుడు తప్ప కిందికి రానేరారు"

ఇల్లు దొరకడం లేదు

అందుకని ప్రఫుల్ పద్మినికి ఏదో నచ్చ చెప్పినాడు. ఆ ఇంట చేరినారు.

X X X

ఒక మాసం జరిగింది.

పద్మిని సాయంకాలం త్వరగా ఇంటిని శుభ్ర పరచి తాను అలంకరిం చుకొని. ప్రఫుల్ కొరకు ఎదురు చూస్తు న్నది. వీధి గుమ్మం వద్ద వేచిచూచి విసుగు పుట్టి గది ద్వారం వద్దనే కూర్చున్నది.

ఈనిరీక్షణలో తాను పట్టించుకోలేదు గాని. మేడ మీద ఆ కుఱ్ఱవాళ్ళలో చిన్నవాడు నాలుగైదు సార్లు మెట్లుదిగి. ఎక్కి వీధిలోనికి వెళ్ళి తన ముందుగా కదలాడి కనబడినాడు.

మేడ మెట్లు వీధి గుమ్మం నుంచే ప్రారంభము. మేడ ఎక్కేవారు కుడి చేతి పక్కగా చూస్తూ మెట్లు ఎక్కితే తను గదిలో ఏమి చేసేదీ అంతా చక్కగా చూడవచ్చు.

తన గదిలో చూడకుండా మెట్లు మాత్రమే చూచుకుంటూ ఎవ్వరూ మేడ ఎక్కరు. ఎందుకనో.

మేడ ఎక్కటానికి మెట్లు చూడనక్కర లేదు. ఒక్కొక్క మెట్టు ఎంత ఎత్తు ఉన్నదో కాళ్ళకు అంచనా తెలిస్తే చాలును.

అతడు మేడ దిగుతూనే ఉన్నాడు. ఎక్కుతూనే ఉన్నాడు. తన వైపు చూస్తూనే వున్నాడు. అతనితో చూపు కలపాలనే తనకు లేదు. అయినా ఎందుకు పని లేక అట్లా పలు మారులు మేడ మెట్ల మీదుగా తిరిగేది! అని కళ్ళతోనే ప్రశ్నించ వచ్చు...... అని పద్మిని అతనివైపు తీక్ష ణంగా చూచింది.

అతడు పద్మిని తనవైపు చూస్తేనే చాలని అనుకొన్నట్లుంది. చిరునవ్వు నవ్వాడు.




‘ఇది తప్పు’ అనుకొన్నది పద్మిని. ‘అతను ఏమో అనుకోవచ్చు.’ అని లేచి, తలుపు వేసుకొని, లోపలికి వెళ్ళి పోయింది. గది చీకటిగా ఉన్నది. లైటు వేసుకున్నది. ప్రఫుల్ వచ్చి తలుపు తట్టి నాడు. “తలుపు వేసుకున్నావేమి? లైటు కూడా వేసావా! ఇంకా అయిదున్నర కూడా కాలేదు, గడియ!”

పద్మిని ముఖంలో వ్యర్థహాసం వెలిగి నది. అది ‘ఈరోజుకు విడుదల అయింది. ఆ కుర్రవాని చూపుల నుంచి’ అన్నంత నిశ్చింత. స్వల్ప కాలము అయితే మాత్ర మేమి! వేదన భరించడము ఎవరికి మాత్రం ఇష్టం? విముక్తి కావాలి.

“ఓహో! ఏమి బాగా ఉన్నావు!” అని మూసిఉన్న తలుపు దగ్గరగా నొక్కి ప్రఫుల్ పద్మినిని చేరినాడు. అతనికది మంచి సమయము వలె తోచింది.

**XXX XXX XXX XXX**

ఆ కుర్రవాడు --- చిన్నవాడు, పదునెనిమి దేండ్లుండవచ్చు. “చిదిమిన పాల్గారు-” ఏదో నాటకములోని పద్యము స్ఫురిస్తుంది- - - - ఆ బుగ్గలలోని సిగ్గు తగ్గలేదింకా మొటిమలైనా పుట్ట లేదు. పసితనం స్ఫురిస్తూంది. అతనికి ఏం ఈ వ్యాపకము? తన వైపు విధిగా చూస్తాడు, పొద్దున ఆరుబైట చిమ్మేటప్పుడు, అప్పటికి ప్రఫుల్ నిద్ర లేవడు. అతడు మెట్లపైగా నిలబడి తనవైపు చూస్తాడు.




వాకిలి చిమ్మి, నీళ్ళు చిలకరించి, ముగ్గు పెట్టేవరకు అక్కడే వుంటాడు. పళ్ళు తోము కుంటాడు. కాని తనను చూడడం కొరకే వస్తాడు- - - -‘- నిజం!

పెరట్లోనికి వెళ్ళి గిన్నెలు, తట్టలు, గ్లాసులు కడుగుకొనేటప్పుడు పైకి చూస్తే కిటికీ దగ్గర అతడు నిలబడే వుంటాడు. అవును చేతిలో ఏదో పుస్తకం మాత్రం తప్పకుండా వుంటుంది. కాని తనను చూడడానికే అతడక్కడ నిలబడేది..... నిజం!

స్నానపు గదికి పైన చిన్న కంత వున్నది. పైన ఎక్కడ నిలచి చూచినా తాను ఎవరికీ కనపడే అవకాశం లేదు. కాని బావి దగ్గరకు వెళ్ళేవాళ్ళు, గోడ దగ్గర ఆగారంటే, ఏమో అనిపిస్తుంది. స్నానం రెండు మూడు నిమిషాలకు పరిమితం అయి పోయింది అందుకే.

సాయం కాలం. అతడు తొందరగా వచ్చి వేస్తాడు. తాను గుమ్మం దగ్గర భర్త కోసరము కాచుకొని ఉంటుంది. కాని అతడు తనకోసమని అనుకుంటున్నా డేమో! ఛీ!.

అతడు అట్లా చూచినపుడల్లా తనకు కోపం వస్తుంది. చిరాకు వేస్తుంది. చేతిలో ఏదుంటే దానిని విసరికొడుతుంది కూడా.

అతని ఈ అలవాటు మానిపించాలి. లేదా, ప్రఫుల్‌తో చెప్పి ఇల్లు మార్పిం చాలి_కాలేజీ కుర్రవాళ్ళు లేని చోటికి.

ప్రఫుల్‌తో చెప్పే ధైర్యం లేదు. - - - - - అతడు గతం తోడితే?

అయిదు వారాలైంది.

మళ్ళీ ఒక సాయంత్రం అతడు ఎప్పటి చూపుతో, అందులో మరింత సంభ్రమం,



ఆనందం ఒలకపోసుకొని వీదిలోనుంచి వచ్చినాడు. అంత ఆనందం లోను పద్మిని తట్టు చూచినాడు.

పద్మిని చీదరించుకున్నది.

'ఈ మగాళ్ళు- - - - - వీళ్ళు మనుష్యులుగా చలామణి అవడం ఎంత విచారకరం!' అని చిన్నబుచ్చుకొంది. అతడు గబాగబా మేడపైకి వెళ్ళి మళ్ళీ ఇరవై నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

అప్పుడే ప్రఫుల్ వచ్చి అడుగిడినాడు కూడా. ఆ కుర్రవాడు నిరుత్సాహంతో దిగువ మెట్టు మీద నిలిచినాడు. ప్రఫుల్ లోనికి. వసారాలోనికి వెళ్ళిన సమయం లో అతని వైపు నిశితంగా చూసింది. అతడింకా అక్కడనే నిలిచి ఉన్నాడు. పద్మిని వైపు చూచి నవ్వుతున్నాడు.

పద్మిని చీదరించుకొని మొగం బిగిం చింది. అతడు నెమ్మదిగా జోబిలోనుంచి ఒక కాగితం తీసి ఆమె దిక్కుగా విసరి వేసినాడు.

ఆమె ఆ చర్యకు అసహ్యించుకొని, తలుపు వేసి కిటికీ వద్దకు వెళ్ళింది. అతడింకా అక్కడే ఉన్నాడు. విసరివేసిన కాగితం నీకేనన్నట్లు సంజ్ఞ చేసినాడు.

'చీ! ఎంతకు తెగించినాడు!'

కిటికీ మూయపోయింది పద్మిని. అతడు కాగితం అక్కడే వదలి గబాగబా మెట్లెక్కి మేడపైకి వెళ్ళిపోయినాడు.




మగజాతిపైనే అసహ్యం కలిగింది పద్మినికి. కన్నెత్తి చూస్తే చాలు. కావాలని, కోరినదని అనుకొంటారు కాబోలు!

విసుగుతో చిరాకుతో కూలబడింది ఆమె.

ప్రఫుల్ వచ్చి కబుర్లు చెప్పి. ఉల్లాస పరిస్తే బాగుండును. గుండె అసహ్యంతో మండిపోతున్నది.

అంతలోనే మెరుపువలె ఆ కాగితం సంగతి గుర్తుకు వచ్చింది. ప్రఫుల్ వస్తాడు. వెలుతురులేదని తలుపుతెరుస్తాడు. అక్కడ ఎదురుగా ఆ కాగితం ఉంటుంది. అతడు దానిని తనకంటే ముందుగా చూస్తాడు.

'అమ్మా!'--- బాధగా అనుకొన్నది పద్మిని. అతడు కాగితం చూస్తే? ----

దానిలో ఏమి ఉండవచ్చు!?

అతడు ఏదో పిచ్చి పిచ్చిగా ఆవేశంతో కుళ్ళుతో రాసి ఉంటాడు. మధ్యలో "నీవు నావైపు చూస్తూ ఉండినావు. నాకు చాల సంతోషము, ప్రోత్సాహము కలిగించినవి" అని వ్రాశాడేమో!

దానిని ప్రఫుల్ చదివి ఏమనుకోవచ్చు?


ఏమైనా అనుకోవచ్చు!

పద్మిని త్వరగా లేచి పెరటి దిక్కు చూచింది. ప్రఫుల్ బావి వద్ద కాళ్ళు కడుగు కొంటున్నాడు. ఇకరావచ్చు. పద్మిని గబగబ వెళ్ళి వీధి తలుపు తీసింది. ఆకాగితం అక్కడేపడి వుంది. తొందరగా వెళ్ళి ఆ కాగితాన్ని తీసుకొని ముక్కలు ముక్కలుగా చించివేసింది. రోడ్డు మీద పారవేసిలోగా ప్రఫుల్ బయటకి రానే వచ్చినాడు.

"ఏమిటి?"




WANTED STOCKISTS IN UNREPRESENTED AREAS



"కాగితము"

"కాగితమా? ఎందుకు చింపేశావు?"

దు:ఖం ఉప్పొంగి వచ్చింది పద్మినికి. కాగితపు ముక్కలు వరండాలో విసిరికొట్టి ఆమెలోపలికి వెళ్ళింది. ప్రఫుల్ కూడా ఆమె వెనుకే వెళ్ళినాడు.

'నేను మొదటే చెప్పినాను. మేడపైన ఉన్న కుర్రవాడు నా వైపు అదేపనిగా చూస్తాడు. కసిరినా, తిట్టినా, తలుపువేసినా, దారి మార్చుకొనలేదు. ఇది మొదటి ఉత్తరము. ఇది చదివితే ఇంకా ఇంకా ఉత్తరాలు వ్రాసాడని చించి వేసినాను. ఇది యథార్థము.... కాని ఎట్లా చెప్పేది?'

ఈ సందేశం మానవ ప్రపంచంలోని ఏ భాషలో కూడా నిజం వలె ధ్వనించదు.

ప్రారబ్ధము

అలంకారములు, భాషాడాంబికము కలిగిన అనృతములు కవిత్వముగా, సాహిత్యముగా మన్ననంది తరా లు తరా లు నిలచిపోగలవు. నిజం పొదిగిన చరిత్రలు విసువుగా నుండగలవు. అసత్యా లు చిరకాలం ఉత్సాహము కలిగించును!

" ఆ కాగితమేమిటి?"

పద్మిని ప్రఫుల్ గుండెపై ఒరిగినది.

అతడామెను విడదీసినాడు.

"కాగితమేమని అడిగితే కౌగిలిలోకి వస్తావేమిటి?"

పద్మిని నేరము చేసినట్లు ముఖము పెట్టి నిస్సహాయంగా ఒక తర్జని పైకి చూపింది.

మెరుపువలె ప్రఫుల్ మేడపైకి వెళ్ళినాడు.

నాలుగు క్షణములలో ఆ కుర్రవానిని చరచర ఈడ్చుకొని వచ్చినాడు.

"చెప్పు, ఎందుకు వ్రాసినావు ఆ కాగితం? ఇందులో ఏమి వ్రాసినావు?"

అతడు మాట్లాడలేదు.

"నీ విట్లా చెప్పవుగా!"అని ప్రఫుల్ అతని షర్టు కాలరును ఒక చేత్తో పట్టి రెండవ చేతితో అతని చిదిమిన పాల్గారు చెక్కుటద్దముల పై" లాగి బలం కొద్దీ కొట్టినాడు.

పద్మిని అదిరిపడింది.

ఒక్కటి ఒక్కటి


అంతే!

అతడు స్పృహతప్పి కింద పడిపోయినాడు

రెండు నిముషాలు పద్మినికి, ప్రఫుల్‌కు ఏమీ తోచలేదు. అతడు పడిపోయిన మరుక్షణం పద్మిని లోపలకు వెళ్ళి కూజాలోని చల్లని నీళ్ళు తెద్దామని ఉద్దేశించింది. కాని ఆమెకు అంతధైర్యం రాలేదు.

కాని నిజం చెప్పి ఉంటే అతనికి ఈ దెబ్బ తగలకపోయేదేమో!

తనకు అతడు ఉత్తరము వ్రాయడము, ప్రఫుల్ అతనిని శిక్షించడము, అదితనకే శిక్షవలెతోచినది. తాను అతనికి స్పృహ తెప్పించే కొరకు చన్నీళ్ళు తెచ్చి శైత్యోపచారము చెయ్యాలనుకోవడము --. ఇందులో ఏదోపొరపాటు వుండవచ్చును. అంతా పొరపాటేనేమో! ముఖ్యముగా, అతని శిక్షా కాలములో తాను శైత్యోపచారము కోసం నీళ్ళు




తేస్తే పొరపాటే కావచ్చును.

స్తబ్ధయైనది పద్మిని.

స్థాణువై నాడు ప్రఫుల్.

"అదేమి, అదేమి! మా రామకృష్ణ కేమైనది?" అంటూ వీధిలో నుండి మేడపైన గదిలో నుండే రెండవ అబ్బాయి పరుగున వచ్చి అతని మీదకు వంగే వరకు అట్లా నేనిలుచున్నారు ఆ దంపతులు.

అప్పుడు పద్మిని లోపలికి వెళ్ళడము, చల్లని నీరు తేవడము యాంత్రికముగా జరిగిపోయాయి. ప్రఫుల్ ఆ గ్లాసును తానే అందుకున్నాడు. రామకృష్ణ ముఖంపైన ఆ నీటిని కొద్ది కొద్దిగా చిలకరించి చూచేవరకు అతడు కొద్దిగా కదలినాడు.

"తమ్ముడూ! లే! ఏం జరిగింది? - - పాపము --- భయంలేదు బాబు -- లే. నేను వచ్చినాను!" అని బుజ్జగించిన ఆ స్వరం ఆత్మీయతలో రామకృష్ణ కన్నులు తెరిపించే అమృతము ఉన్నది.

అతడు చటుక్కున లేచినాడు.

"వాడిని కొట్టినారా? " అన్నాడు ఆ వచ్చిన అబ్బాయి రామకృష్ణ బుగ్గను చేతితో తడుముతూ.

"మీవాడు నా చేతిలో కనుక ప్రాణము దక్కించుకొన్నాడు. మరొక చోట అయితే యీ నూరేళ్ళు నిండి ఉండేవి

అదిగో మీ వాడు ఈమెకు వ్రాసిన లేఖ!" అని తాను దిగమింగిన క్రోధము అభినయంతో సహా ప్రకటిస్తూ ప్రఫుల్ ఆ కాగితపు ముక్కలు చూపించినాడు.

రామకృష్ణ ముఖంలో రంగు పోయినది. అతడు అన్నగారిపై వేడి తల విలవిల కొట్టుకోసాగినాడు. పద్మిని వైపు చూపి ఏదో అర్థరహిత ధ్వనులు చేసినాడు.

"అతనికి మాటలు రావా?" అన్నాడు ప్రఫుల్.

"అవును స్వామీ! మా రామకృష్ణ మూగవాడు. సాధారణముగా తప్పు చేయడు. ఎట్లాగో ఈమారు తప్పు చేసి ఉండవచ్చునేమో! .... అదంతా వాని ఖర్మము ...."

"మూగవాడా" పద్మిని దిగ్భ్రాంతి చెందినది.

'మూగవాడు కనుకనే నోటితో చెప్పలేక కాగితము వ్రాసినాడు' అనుకున్నాడు ప్రఫుల్.

రామకృష్ణను చేతులతో వొడిసి పట్టుకొని నెమ్మదిగా మెట్లమీదుగా నడిపించుకొని వెళ్ళినాడు ఆ అన్న. "ఏమి వ్రాశావు తమ్ముడూ, ఆ కాగితంలో?" అని బుజ్జగించి అడుగుతున్నాడు.

ప్రఫుల్ పద్మినివైపు చూశాడు. 'అవును, ఏమి వ్రాశాడు?' అని ఆ చూపు పద్మిని నడిగింది.

ఆమె తల అడ్డముగా ఆడించింది. అందులో నిర్దోషిత్వము బుజువు కానట్లు తోచినది.

ఆ కాగితపు ముక్కలు అక్కడనే వున్నవి. ప్రఫుల్ కొంచెము శ్రమించి ప్రయత్నిస్తే అందులో ఏమి వ్రాసినది అర్థము కాకపోదనిపించింది.

* * * * *

పద్మిని గారూ!

మీ వారు మిమ్ములను "పద్మినీ!" అని పిలుస్తూ ఉన్నారు. మీ పేరు అదే అయివుంటుందని అనుకున్నాను.

మీరు ముమ్మూర్తులా మా అక్కను పోలియున్నారు. మా అక్కగారు మీవలెనే చాలా సౌందర్యవతి! సౌశీల్యవతి కూడా. ఆమెకు ఒక ఇంజనీరు భర్త లభించినాడు. ఆమెను ఎంతో ప్రేమతో చూచుకొనే వారు. తన స్నేహితులందరికీ పరిచయం చేసి ఎంతో మురిసి పోయేవాడు.

మూడు సంవత్సరాల క్రిందట మా అక్కకు స్ఫోటకము పోసింది. ఆమె ముఖము వికృతముగా మారిపోయింది. చూపు దెబ్బతినింది. కళ్ళకు మందపాటి అద్దాలు ఏర్పడినవి. బావగారు ఆమెను అప్పటికీ బాగానే ఏ మార్పు లేకుండా చూచుకొనే వారు. కాని అక్కను ఏదో సందేహము బాధించేది.

ఆమె పండుగకు వచ్చి మా ఇంట్లోనే ఆత్మహత్య చేసికొన్నది.

మిమ్ములను మొదటిరోజు చూడగానే మా అక్కగారే గుర్తుకు వచ్చింది. మా అక్కకు నా సంగీతమంటే ప్రాణము. నేను బాగా ఫిడేలు వాయించగలను. మీకు నా సంగీతము వినిపించవలెనని, మీలో మా అక్కను చూడవలెనని నా కుతూహలము! నా ఆరాటము.

నా సంగీతము ఎప్పుడు వింటారు? నా అక్కగా ఎప్పుడౌతారు?

ఇట్లు
మీ నిత్య శ్రేయోభిలాషి
ఆత్మీయ సోదరుడు,
- రామకృష్ణ -

* * * * *

"వేరే ఇల్లు చూచాను, పద్మినీ సామానులు కట్టిపెట్టు, వెళ్ళిపోదాము" అన్నాడు ప్రఫుల్ ఆ మరుసటి రోజు ఆఫీసునుండి రాగానే!

పద్మిని నిర్ఘాంతపోయింది.